క్లుప్తంగా

గరుడ వాహనంపై వేంకటేశ్వరుడు

ఆలమూరు: చింతలూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం స్వామివారిని గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఆలయం ఆవరణలో వేకువజామున భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. పురవీధులు గోవింద నామస్మరణతో మార్మోగిపోయాయి.

నేటి నుంచి వంతులవారీ విధానం

అంబాజీపేట: ముక్కామల లాకులపై ఉన్న కాలువలకు బుధవారం రాత్రి 11 గంటల నుండి గురువారం రాత్రి 11 గంటల వరకు 24 గంటల పాటు వంతుల వారిగా సాగు నీరు అందించనున్నట్టు కొత్తపేట అసిస్టెంట్ ఇంజినీర్ మంగళవారం తెలిపారు. మొడుకుర్రు, నేదునూరు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, ఎస్.సావరం, బిళ్లకుర్రు, వక్కలంక రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

వీరభద్ర స్వామికి వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటం, ఇత్తడి మకరతోరణంతో భక్తులు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ పరిధిలోని అరిగెలవారిపాలెంలో ఉన్న వీరభద్ర స్వామి వారికి వెండి కిరీటం, ఇత్తడి మకర తోరణాలను భక్తులు సమర్పించారు. అరిగెల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.80 వేల విలువైన వెండి కిరీటాన్ని స్వామివారికి బహుకరించారు. యర్రంశెట్టి శిరిడి సాయి రామ్ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు వీరభద్రరావు రూ.18 వేల విలువైన ఇత్తడి మకర తోరణాన్ని, కొంతమంది భక్తులు స్వామివారికి వెండి వస్తువులు ఆలయానికి అందజేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించి, 1300 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసి, 2 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కే కాత్యాయని తెలిపారు. ఆత్రేయపురం మండలం పేరవరం గోదావరి లంకలోని ఇసుకలో సారా తయారుకు ఉపయోగించే బెల్లం ఊట ఉంచిన ప్లాస్టిక్ డ్రమ్ములను గుర్తించారు. ఆ డ్రమ్ములను వెలికితీసి ధ్వంసం చేశారు. అదే మండలం మెర్లపాలెం గ్రామంలో చిటికెన తాతారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు.

విద్యార్థులకు స్కౌట్ అండ్ గైడ్ డ్రెస్సుల పంపిణీ

రావులపాలెం: వెదిరేశ్వరం హైస్కూల్లో విద్యార్థులకు మంగళవారం స్కౌట్ అండ్ గైడ్ డ్రస్సులను పంపిణీ చేశారు. రూ.30 వేలు విలువైన ఈ డ్రెస్సులను ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మారే సుబ్బాయమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కర్రి ఈశ్వర్ రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేలను త్వరగా పూర్తి చేయాలి

అయినవిల్లి: సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ జి.భీమారావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. సర్వేలను ప్రతీ ఒక్కరూ సక్రమంగా నిర్వహించాలన్నారు.

వంతెన డివైడర్‌ను ఢీకొన్న కారు

అయినవిల్లి: నేదునూరు పెదపాలెంకు చెందిన ఓ వ్యక్తి తాను కొత్తగా కొనుగోలు చేసిన కారుకు మంగళవారం అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి తిరిగి ఇంటికి వెళుతున్న సయంలో అదుపు నేదునూరు కుమ్మరికాలువకు ఏర్పాటు చేసిన వంతెన డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కారు ముందర భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. డ్రైవర్, అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షింతంగా బయట పడ్డారు.

21న జాబ్ మేళా

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21 తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు.రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీటెక్ కెమికల్, బీఫార్మసీ, ఎం ఫార్మసీ ఉత్తీర్ణలైన వారు, ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ, బల్క్ డ్రగ్స్‌లో ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ గా పనిచేందుకు దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న పురుష అభ్యర్థులు ఉదయం 10 గంటలకు కళాశాలకు బయోడేటా ఒరిజినల్ జిరాక్స్, కాపీలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8074734412 నంబర్‌లో, కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దీనికి సంబంధించి బ్రోచర్‌ను రిలీజ్ చేశారు.

అయ్యప్ప ఆలయం.. ఆధ్యాత్మిక క్షేత్రం



వాడపాలెం అయ్యప్ప స్వామి, జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం

నేడు వాడపాలెంలో అయ్యప్ప స్వామి, జ్ఞాన సరస్వతి ఆలయ 10 వార్షికోత్సవం

కొత్తపేట: వాడపాలెంలో ఉన్న అయ్యప్పస్వామి, జ్ఞాన సరస్వతీదేవి ఆలయం పది వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ ఆలయ నిర్మాణంతో ఆ గ్రామం ఆధ్యాతికంగా విరాజిల్లుతుంది. ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. గౌతమీ గోదావరి నదీతీరాన బొబ్బర్లంక - ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువకు చేర్చి విశాలమైన స్థలాన్ని సమకూర్చి 2015 సంవత్సరంలో ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో కింద జ్ఞాన సరస్వతీదేవి అమ్మవారిని, పైన అయ్యప్పస్వామిని ప్రతిష్ఠించారు. ఈ ఆలయ వార్షికోత్సవం, వివిధ పుణ్య తిథులు, అయ్యప్పస్వామి మండల, జ్యోతి దీక్షలు పురస్కరించుకుని ఆ క్షేత్రం, ఆ గ్రామం ఆధ్యాతిక్మకంగా అలరారుతుంది. ఇక్కడ అయ్యప్ప మండల దీక్ష చేపట్టిన మాలధారులకు 41 రోజుల పాటు ఉచిత భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 250 మంది మాలదారులు భిక్షను స్వీకరిస్తారు. వసంత పంచమి సందర్భంగా వందలాది మంది బాలలతో సరస్వతీదేవి పూజ ఘనంగా నిర్వహించి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తారు. ఈ నెల 19 మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా ఆలయ 10 వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ఇన్‌చార్జి మట్టా బాబ్జి తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు దొంతుకుర్తి రామచంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం నుంచీ అయ్యప్ప స్వామి, జ్ఞాన సరస్వతీదేవి అమ్మవారికి, పరివార దేవతలకు విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు హౌస్ అరెస్టు



మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుకు నోటీసు ఇస్తున్న ఏఎస్సై శ్రీనివాసరావు



కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుకు నోటీసు అందజేస్తున్న పోలీసు కానిస్టేబుల్

రావులపాలెం: మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావును మంగళవారం రావులపాలెంలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా చలో తుని కార్యక్రమానికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో అక్కడకు వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. తుని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయడంపై రాజా చలో తునికి పిలుపు నిచ్చారని, దీంతో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూర్యారావును అక్కడికి వెళ్ల వద్దని నోటీసు అందినట్టు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

గన్నవరపు హౌస్ అరెస్టు

అయినవిల్లి: కాకినాడ జిల్లాగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపు ఇచ్చిన చలో తుని కార్యక్రమానికి హాజరు కాకుండా పి.గన్నవరం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్‌రావుని మంగళవారం హౌస్ అరెస్టు చేశారు. కానిస్టేబుల్ నోటీస్ అందించి తుని కార్యక్రమం వెళ్లకుడదని హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పక్షాన పోరాడవారినే అణగ దొక్కే ప్రయత్నాలు చేస్తుందని అటువంటి చర్యలు మానుకోవాలన్నారు. అలాగే విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శిరీష్ నారాయణస్వామిని కూడా అరెస్టు చేశారు.

ఆరుతడి పంటలతో బహుళ ప్రయోజనం

డీపీఎం ఎలియాజర్



ఈదరాడ సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం ఎలియాజర్

మామిడికుదురు: ఆరుతడి పంటలో రైతులకు బహుల ప్రయోజనం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం జె.ఎలియాజర్ సూచించారు. ఆరుతడి పంటలపై ఈదరాడ, మాకనపాలెం గ్రామాల్లో రెండు రోజుల శిక్షణా సమావేశాలు మంగళవారం ముగిసాయి. దీనిలో భాగంగా ఈదరాడలో జరిగిన సమావేశంలో ఎలియాజర్ మాట్లాడారు. కార్బన్ ఉద్గారాలను నియంత్రించుకోవాలని సూచించారు. ఆరుతడి విధానం ద్వారా 30 శాతం సాగునీరు ఆదా అవుతుందన్నారు. 50 శాతం వరకు మీథేన్ ఉద్గారాలను తగ్గించుకోవచ్చన్నారు. వేరు దశ మెరుగుపడుతుందన్నారు. వ్యాధుల ప్రభావం కూడా తక్కువగా ఉంటుందన్నారు. ఎక్కువ దిగుబడి వస్తుందని చెప్పారు. దోమలు, నీటి ద్వారా వచ్చే వ్యాధుల వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. రైతులు విశిష్ట ఐడీని వెంటనే పొందాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పలువురు ఉత్తమ రైతులను సమావేశంలో ఘనంగా సన్మానించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, ఏడీపీఎం ఎంవీవీ సత్యనారాయణ, ఏఓ కె.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ రాధిక, మాస్టర్ ట్రైనీలు జె.నాగవేణి, కె.జానకి, మేడల్ మేకర్లు సీహెచ్ రాధ, కె.పద్మావతి, రైతులు యెరుబండి సూరిబాబు, యెరుబండి లక్ష్మయ్య, కుసుమ శ్రీధర్, నయనాల శ్రీరంగనాథం తదితరుల పాల్గొన్నారు.

రాజోల్ నుంచి అయినవిల్లికి బస్సు సర్వీసులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయానికి రాజోలు డిపో నుంచి తాటిపాక, మామిడికుదురు, అమలాపురం, అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంకు చేరుకునేందుకు బస్సు సర్వీసులు బస్సులు నడుపుతున్నట్టు రాజోలు డీఎం ధనమ్మ తెలిపారు. మంగళవారం అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో రాజోలు-అయినవిల్లి బస్సు డ్రైవర్ ఎస్.నాగేశ్వరరావు, కండక్టర్ వి. దుర్గమ్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వీరు అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి రాజోల్ బస్సు డిపో నుంచి మూడు దఫాలుగా తిరిగేలా డిపోమేనేజర్ ధనమ్మ బస్సులను నడుపుతున్నారన్నారు. ఉదయం ఆరు గంటలకు రాజోల్ డిపోలో ప్రారంభమై అమలాపురం ఉదయం 7.15 గంటలకు చేరుకుటుందన్నారు. అక్కడ నుంచి అయినవిల్లి ఉదయం 8 గంటలకు వస్తుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు సాయంత్రం 4 గంటలకు అయినవిల్లికి సర్వీసులు ఉన్నాయన్నారు. అయినవిల్లికి బస్సులు ఉండడంతో పాలకొల్లు, భీమవరం, రాజోలు, తాటిపాక, మామిడికుదురు ప్రాంత ప్రజలు ఆనందం వక్తం చేస్తున్నారు. అప్పనపల్లి, అంతర్వేది బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

హైలెవెల్ వంతెన నిర్మాణ ప్రతిపాదనలకు సర్వే



అయోధ్యలంక రేవును పరిశీలిస్తున్న అధికారులు

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సరిహద్దులోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆనగర్లంక, అయోధ్యలంక గ్రామాలకు వశిష్ఠ నదీపాయపై హై లెవెల్ వంతెనల నిర్మాణం కోసం ప్రతిపాదలు సిద్ధం చేసేందుకు మంగళవారం పీఆర్ ప్రాజక్టు విభాగం అధికారులు సర్వే నిర్వహించారు. రోడ్డు కనెక్టివిటీ లేని ఈ రెండు గ్రామాలకు వంతెనలు నిర్మించేందుకు పీఎం జీఎస్‌వై పథకం కింద నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. వీటిని సిద్ధం చేసేందుకు గాను పాలకొల్లు సబ్ డివిజన్‌కు చెందిన డీఈ వెంకటరత్నం, ఏఈ మెహర్‌బాబాలు కోనసీమ జిల్లాకు చెందిన డీఈఈ అన్యం రాంబాబుతో కలిసి మంగళవారం సర్వే నిర్వహించారు. పి.గన్నవరం మండలం మొండెపులంక శివారు పుచ్చల్లంక నుంచి వశిష్ఠ నదీపాయపై 320 మీటర్ల పొడవున 7.5 మీటర్ల వెడల్పున వంతెన నిర్మాణానికి రూ.95 కోట్లు, యర్రంశెట్టివారిపాలెం నుంచి ఆనగర్లంకకు 275 మీటర్ల పొడవున 7.5 మీటర్ల వెడల్పున వంతెన నిర్మాణానికి రూ.80 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ వంతెనల ద్వారా గ్రామాలకు నుసంధానం ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలకు మేలు జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఊడిమూడిలంక వంతెన ఐదో పిల్లర్‌కు మట్టి పరీక్షలు

పి.గన్నవరం మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.49.5 కోట్ల వ్యయంతో వశిష్ఠ నదీపాయపై నిర్మితమవుతున్న వంతెన పనుల్లో భాగంగా ఐదో నంబర్ పిల్లర్ కోసం మంగళవారం మట్టి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 35 మీటర్ల లోతు వరకూ మట్టి పరీక్షలు చేసి, పిల్లర్ లోతును నిర్ధారించారు. కార్యక్రమంలో పీఆర్ ప్రాజక్టు విభాగం ఎస్ఈ ఏవీ -శ్రీనివాస్, ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈఈ అన్యం రాంబాబు, జేఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు వేగవంతం చేయాలి

ఏడీఏ వెంకటరామారావు



ఆత్రేయపురం ఆర్ఎస్‌కేలో రైతుల నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరామారావు

కొత్తపేట: భూమి ఉన్న రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించి గ్రామాల్లో రైతుల పేర్లు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ స్థానిక సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వెంకటరామారావు వీఏఏలకు సూచించారు. సబ్ డివిజన్ పరిధిలోని పలు రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియను ఏడీఏ వెంకటరామారావు మంగళవారం పరిశీలించారు. ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలో ఎంత మంది రైతులు? ఇంత వరకూ ఎంతమంది తమ పేర్లు నమోదు చేయించుకున్నారు? అనే అంశాలను ఆరా తీశారు. ఈ నెల 25 వరకూ మాత్రమే నమోదు చేసుకోవచ్చని, రైతులు సకాలంలో పూర్తి చేయాలని ఏవోలు, సిబ్బందికి సూచించారు. సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఆధార్ కార్డు తరహాలో సొంత భూమి ఉన్న రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక గుర్తింపు కార్డు (కిసాన్ కార్డు) ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని, రైతుల పేర్లు నమోదు కార్యక్రమం చేపట్టిందన్నారు. భవిష్యత్తులో వివిధ పథకాల అమలుకు ఈ విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరన్నారు. దీనిలో సొంత భూమి కలిగిన రైతులు అందరూ నమోదు చేయించుకోవాలన్నారు.నమోదు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం నకలు జిరాక్స్ లేదా 1-బీ, ఆధార్ పత్రం, ఆధార్ అనుసంధానం అయిన సెల్ నంబరు వివరాలు ఇస్తే సిబ్బంది నమోదు చేస్తారన్నారు. సబ్ డివిజన్‌లోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలతో పాటు ఆలమూరు మండలంలో పీఎం కిసాన్ పీఎం కిసాన్ లబ్ధిదారులు (రైతులు) 20,744 మంది ఉండగా ఇప్పటి వరకు సుమారు 6,791 మంది రైతులు పోర్టల్‌లో తమ పేరు నమోదు చేసుకున్నారని ఏడీఏ వెంకటరామారావు తెలిపారు. ఈ

దివ్యాంగుల సమస్యలపై సర్వే

రాజోలు: దివ్యాంగుల సమస్యలను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించేందుకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పొదలాడలో సర్వే నిర్వహించారు. ఇంటింటా సర్వే చేపట్టి దివ్యాంగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నుంచి అందిస్తున్న పెన్షన్, సదరమ్ ధ్రువీకరణ పత్రాల నమోదు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అమలాపురంలోని డైస్ సెంటర్ ద్వారా 18 ఏళ్ల లోపు బాలబాలికలకు వైద్య సదుపాయం కల్పిస్తున్నారని వివరించారు. గుర్తించిన సమస్యలను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. ప్యానల్ న్యాయవాదులు జి.రజిత, ఆచంట శ్రీనివాస్, పారా లీగల్ వలంటీర్లు ఎస్.మహలక్ష్మి, కె.సురేంద్ర కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివతేజ, ఏఎన్ఎం సునీత, అంగన్ వాడీ కార్యకర్తలు బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువ పరిశీలన



పంట కాలువ పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్న గారపాటి

ఆలమూరు: పంటలకు అవసరమైన సాగునీటిని సక్రమంగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చింతలూరు నీటిసంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు అన్నారు. ఆలమూరులోని ఖండ్రిగ నుంచి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మీదుగా చింతలూరు వెంబడి వెళ్లే పంట కాలువను మంగళవారం ఆయన పరిశీలించారు. పంట కాలువల గట్లను, మురుగునీటి పారుదల వ్యవస్థలను ఆక్రమించి భవనాలు నిర్మించు కోవడాన్ని ఆయన గుర్తించారు. అంతేకాకుండా పూడికతో నిండిపోయిన ఈ పంట కాలువలను తక్షణమే అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలువల్లో పూడిక తీసి పంట పొలాలకు సాగునీటిని సక్రమంగా అందించాలని రైతులు, దోమల బెడదను నివారించాలని హాస్టల్ విద్యార్థులు ఈ సందర్భంగా సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటిని కోరారు.

ఉపాధి పనుల్లో చెట్ల పళ్లాల తవ్వకం



ఉపాధి హామీలో చెట్ల పళ్లాలు తవ్వుతున్న కూలీలు

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లాల తవ్వకం పనులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పెదపట్నంలంక గ్రామంలో ఇంత వరకు 38 పనులు నిర్వహించారు. సుమారు ఆరు వేల కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లాలు తవ్వారు. గ్రామంలో 188 మంది ఉపాధి కూలీలు జాబ్ కార్డులు పొందారు. మంగళవారం 70 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నారని ఫీల్డ్ అసిస్టెంట్ మేడిది సీతామహలక్ష్మి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు ప్రాధాన్యతా క్రమంలో చెట్ల పళ్లాల తవ్వకం పనులు నిర్వహిస్తున్నామన్నారు.

కళాత్మక వస్తువుల తయారీపై శిక్షణ



మహిళలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

మామిడికుదురు: కొబ్బరి చిప్పలతో కళాత్మక వస్తువుల తయారీపై పాశర్లపూడిబాడవలో మహిళలకు శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఇక్కడ శిక్షణ కొనసాగుతుంది. ఈ శిక్షణకు 30 మంది మహిళలు హాజరయ్యారు. ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణలో అన్నమయ్య జిల్లాకు చెందిన క్రాఫ్ట్ కళాకారుడు ఎ.హరికృష్ణ కళాత్మక వస్తువుల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. కొబ్బరి చిప్పలతో ఇళ్లలో అలంకరించుకునే పలు రకాల కళాత్మక వస్తువులను తయారు చేయవచ్చని హరికృష్ణ పేర్కొన్నారు. ఈ వస్తువుల తయారీ ద్వారా మహిళలకు జీవనోపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కటికిరెడ్డి గంగాధరమ్ పాల్గొన్నారు. కాగా శిక్షణా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా సందర్శించారు.

జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు ప్రారంభం



సఖినేటిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు ప్రారంభించిన ఎంఈవో-1 కిషోర్ కుమార్



మామిడికుదురులో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

సఖినేటిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులను అధికారులు ప్రారంభించారు. ప్రీ-ప్రైమరీ(పి.పి.)1, 2ను బలోపేతం చేసే దిశగా ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను ఎంఈవో-1 డీ కిశోర్ కుమార్ ప్రారంభించారు.ఈ శిక్షణ ఆరు రోజులు ఉంటుందని తెలిపారు. బాల్యారంభ దశలో పిల్లల పోషణ, విద్యను బలోపేతం చేసేందుకు వీటిని నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. అలాగే ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా అంగన్‌వాడీ విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తామని కూడా కిశోర్ కుమార్ తెలిపారు. మండలంలోని 70 మంది అంగన్‌వాడీ టీచర్లు హాజరైనారు. ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం కే.వీరాస్వామి పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్‌గా విజయ భారతి, మీరా మున్నీషా, చంద్రకళ, సత్తిపండు, మధువర్మ, శ్రీనివాస్ వ్యవహరించారు.

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆట పాటలతో పాటు గుణాత్మక విద్యను అందించాలని మండల విద్యాశాఖాధికారి, కోర్స్ డైరెక్టర్ కాండ్రేగుల వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ (సాల్ట్) ఆధ్వర్యంలో ఫండమెంటల్ లెట్రసీ అండ్ న్యూమెర్సీ (ఎఫ్ఎల్ఎన్)లో భాగంగా నూతన విద్యా విధానం అనుసరించి అంగన్‌వాడీ టీచర్లకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుపై శిక్షణను ఆరు రోజులు పాటు ఇస్తున్నామన్నారు. చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ రీజనస్, గుణాత్మక విద్య విద్యార్థుల్లో పెంపొందించే అంశాలపై డీఆర్పీలు సీ.హెచ్.వెంకటసతీష్, బి.ఆర్.ఎన్.శ్రీనివాస్, డి.ఎస్.రమేష్‌లు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో స్టాఫ్ సెక్రటరీ వెన్నపు సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీఎస్‌వీ.మహాలక్ష్మి, ఎన్.వెరినమ్మ పాల్గొన్నారు.

రావులపాలెం: అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం ఇస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాసరాజు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో మంగళవారం ఫౌండేషనల్ లిట్రస్సీ అండ్ న్యూమరస్సి (ఎఫ్ఎల్ఎన్) శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ నిర్మల కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హిమశ్రీ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: మండలంలోని 72 మంది అంగన్‌వాడీ టీచర్లకు మహిళాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్‌లో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుపై ఆరు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందని ఎంఈఓ ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు తెలిపారు. పునాది అభ్యసనను బలోపేతం చేయడం, పిల్లలకు ఆటలు కృత్యాల ద్వారా అభ్యసన చేయడం, తల్లిదండ్రుల భాగస్వామ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ నిరంజని, వెన్యూ ఇన్‌చార్జి టి.వెంకటేశ్వరరావు, వై.పల్లంరాజు, ఎంఎన్ మునేశ్వరరావు, పి.విజయలత, బి.అన్నపూర్ణ, ఎస్.సుబ్బలక్ష్మి, డీఆర్పీలుగా ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు.

అయినవిల్లి: స్థానిక ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణను ఎంఈఓ పెచ్చెట్టి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు శిక్షణ తరగతులు ప్రారంభించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, ఆరోగ్య, భాషాభివృద్ధి, సాంఘిక జీవన నైపుణ్యాలు పెంచే విధంగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌గా ఐసీడీఎస్ సూపరవైజర్లు విజయ గౌరీ, జి.రామలక్ష్మి, వి.కె.పల్లంరాజు, పి.శ్రీనివాసరావు బి.సందీప్ వ్యవహరించారు.

చిన్నారుల్లో జ్ఞానజ్యోతిని వెలిగించాలి

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పం మేరకు చిన్నారుల్లో జ్ఞానజ్యోతిని వెలిగించి భావి భారత అత్యుత్తమ పౌరులుగా తీర్చి దిద్దాలని ఎంపీడీఓ ఏ రాజు అన్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను మండల విద్యాశాఖ అధికారులు భమిడిపాటి అప్పాజీ, ఎస్వీ సుబ్బరాజుతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. విశాఖపట్నం నుంచి వచ్చిన ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు టీఎస్వీ నాగలక్ష్మి, వై.అరుంధతి స్థానిక ఉపాధ్యాయులతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణను ఇచ్చారు. ఉపాధ్యాయులు ఎంపీవీ రామరాజు, ఏ వెంకటేశ్వరరావు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.